

**కారేపల్లి నుంచి వచ్చాం..**

మా నాన్న సర్దార్ కారేపల్లిలో మెడికల్ షాపు నిర్వహిస్తారు. డీఎస్సీ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు 35 కిలోమీటర్లు ప్రయాణించి ఖమ్మం వచ్చాం. కానీ ప్రభుత్వం చెప్పినట్లుగా ఇక్కడ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ జరగట్లేదు. దీనిపై ముందస్తుగా కొంత సమాచారం ఇస్తే ఇక్కడ వరకు వచ్చేవాళ్లం కాదుకదా.

**–రిజ్వానా, డీఎస్సీ ఎస్‌జీటీ అభ్యర్థిని**

- ఖమ్మం జిల్లా డీఎస్సీ-2024 అభ్యర్థుల్లో గందరగోళం
- తొలిరోజు జాబితా రాలేదు.. సర్టిఫికెట్ల పరిశీలన జరగలేదు..
- ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచిచూసిన విద్యాశాఖ
- నేడు ఎస్‌జీటీలు, రేపు ఎస్‌ఏ అభ్యర్థులకు వెరిఫికేషన్



జాబితా రాకపోవడంతో అభ్యర్థులకు సూచనలు చేస్తున్న డీఈవో కార్యాలయ సిబ్బంది

# సహనానికి సర్కారు పరీక్ష

**ప్రభుత్వ నిర్లక్ష్యంతో పొద్దంతా అభ్యర్థుల పడిగాపులు**

ఖమ్మం, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో సర్కారు చేసిన నిర్లక్ష్యం అభ్యర్థుల సహనానికి పరీక్షగా మిగిలింది. నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడం, విధివిధానాలు లేకుండా ఆర్భాటంగా ప్రక్రియను నిర్వహించాలనుకోవడం, జాబితా వెలువరించకుండానే సర్టిఫికెట్ల పరిశీలనకు షెడ్యూల్ విడుదల చేయడం, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూసినా డీఎస్సీ జాబితా రాకపోవడం వంటివి కాంగ్రెస్ ప్రభుత్వ మొద్దు నిద్ర పాలనకు అద్దం పడుతోంది. 'డీఎస్సీ ఫలితాలు విడుదల చేశాం. సర్టిఫికెట్ల పరిశీలన చేస్తాం. సీఎం చేతుల మీదుగా ఉత్తర్వులు అందిస్తాం..' అంటూ సోమవారం ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం చేతల్లో చతికిలబడిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాటలు తప్ప చేతలు ఉండవని 24 గంటలు గడవకముందే తెలంగాణ ప్రజలకు మరోసారి తేటతెల్లమైంది. డీఎస్సీ-2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం ఉదయం నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. కానీ.. 1:3 నిష్పత్తితో కూడిన అభ్యర్థుల జాబితా రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా విద్యాశాఖకు రాలేదు. దీంతో సదరు అభ్యర్థులకు రోజంతా ఎదురుచూపులే మిగిలాయి.

### పరిశీలన జరగలే..

డీఎస్సీ-2024 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా మంగళవారం ఖమ్మం రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లలో వివిధ కేటగిరీల్లో ధ్రువపత్రాల పరిశీలనకు మొత్తం 11 బృందాలను నియమించింది. ఒక్కో బృందంలో ఇద్దరు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను నియమించారు. వీరంతా ఉదయం 10 గంటలకే సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించే పాఠశాలకు చేరుకున్నారు. నిర్దేశించిన సమయం గడుస్తున్నా ఉన్నతాధికారుల నుంచి జాబితా అందలేదు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎదురుచూసినా జాబితా పరిశీలన జరగలేదు.

### ఏడీ, డీఈవోకూ తప్పని పడిగాపులు..

ఈ ప్రభుత్వం తొలిసారి నిర్వహించిన డీఎస్సీ కావడంతో ఆటంకాలు జరగకుండా ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ (ఏడీ) శ్రీనివాసాచారి మంగళవారం జిల్లాకు చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఈవో సోమశేఖర శర్మతో వెరిఫికేషన్ ప్రక్రియపై చర్చిస్తూనే ఉన్నారు. అభ్యర్థులు కూడా సహనానికోర్చి వేచిచూశారు. వారు ఉదయం ఉన్నతాధికారులను సంప్రదిస్తే మధ్యాహ్నం వరకు జాబితా వస్తుందని చెప్పారు. మధ్యాహ్నం చేస్తే మరో గంటలో వస్తుందని, ఆ తర్వాత చేస్తే సాయంత్రం 5 గంటల్లోపు వస్తుందని సమాధానమిస్తూ వచ్చారు. చివరికి డీఎస్సీ జాబితా రాలేదని, వచ్చాక సమాచారం ఇస్తామని చెప్పి అభ్యర్థులను పంపించారు.

### నేడు ఎస్‌జీటీలకు.. రేపు ఎస్‌ఏలకు..

డీఎస్సీ-2024 సర్టిఫికెట్ల పరిశీలనలో భాగంగా బుధవారం నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)కు, గురువారం నుంచి స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ)కు ఖమ్మం రోటరీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

### ఒకరోజు సమయం ఇస్తే బాగుండేది..



ఎస్‌జీటీ విభాగంలో సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చాను. ఇక్కడ సర్టిఫికెట్ల పరిశీలనపై ఎలాంటి సమాచారమూ లేదు. జాబితా కూడా వెలువరించలేదు. హడావిడిగా కాకుండా ఒక రోజు సమయం ఇచ్చి ప్రక్రియను నిర్వహిస్తే బాగుండేది. నిన్నంతా రిజల్ట్స్ చూసుకోవడానికే సరిపోయింది, సర్టిఫికెట్లు అన్ని చెక్‌లిస్ట్ ప్రకారం తయారుచేసుకోవాలి.

**–నాగరాజు, డీఎస్సీ ఎస్‌జీటీ అభ్యర్థి**

### అభ్యర్థుల్లో నిరుత్సాహం..

జిల్లాల వారీ డీఎస్సీ ఫలితాలపై సోమవారం రాత్రి వరకు పూర్తిస్థాయిలో స్పష్టత లేదు. మంగళవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన అంటే అభ్యర్థుల్లోనూ గందరగోళం నెలకొంది. 'ధ్రువపత్రాల పరిశీలన జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకోవడం. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే వారు సొంత ఊర్లకు చేరుకోవడం, నాన్ క్రీమీలేయర్ వంటి సర్టిఫికెట్లు తీసుకోవడం వంటి ముఖ్యమైన పనులు ఉన్నాయి. ఇవన్నీ సరిచూసుకునేందుకు ఒక్కరోజు కూడా సర్కారు సమయం ఇవ్వలేదు. అయినప్పటికీ వెంటనే షెడ్యూల్ ఇవ్వడం, ఇచ్చిన షెడ్యూల్‌ను అమలు పర్చకపోవడం పట్ల అభ్యర్థుల్లో నిరుత్సాహం, గందరగోళం నెలకొన్నాయి.

## పోరాడే నేతలపై దాడులా?

**కేటీఆర్‌పై దాడిని ఖండించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట రూరల్, అక్టోబర్ 1: ప్రజా సమస్యలపై పోరాటం చేసే వారిపై దాడులు చేసి అడ్డుకోవాలనుకోవడం నీతిమాలిన చర్య అని, ప్రజా పాలన అంటే రౌడీ రాజ్యమా.. అని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రశ్నించారు. తాటిసుబ్బన్నగూడెంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో మూసీ పరీవాహక బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ మూకలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రౌడీ రాజ్యాన్ని భరించే స్థితిలో ప్రజలు లేరని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేకనే ప్రతిపక్ష నేతలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఎంతో సహనంతో కాంగ్రెస్ విధ్వంస కాండను చూస్తున్నారని, సహనం కోల్పోతే కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా తన వైఖరి మార్చుకొని గ్యారెంటీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ గూండాల దాడి పిరికిపందల చర్య

**జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు**



లింగాల కమల్‌రాజు

మధిర, అక్టోబర్ 1: హైదరాబాద్‌లో హైడ్రా బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ గూండాల దాడి పిరికిపంద చర్య అని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు పాల్పడడం మంచి సంస్కృతి కాదన్నారు. ప్రజా సమస్యలు తెలుపుకునేందుకు.. నిత్యం ప్రజలతో మమేకమయ్యే బీఆర్‌ఎస్ నేతలపై మరోసారి దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, రైతుబంధు పథకాల నుంచి తప్పించుకునేందుకు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ డ్రామాలకు తెరలేపిందని ఆయన పేర్కొన్నారు.

## పాలన చేతగాకనే కేటీఆర్‌పై దాడి



కేటీఆర్‌పై కాంగ్రెస్ మూకల దాడిని ఖండిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

**దాడిని ఖండించిన బీఆర్‌ఎస్ శ్రేణులు**

అశ్వారావుపేట, అక్టోబర్ 1: పాలన చేతగాని కాంగ్రెస్ నేతలు.. నిత్యం ప్రజల్లో ఉండే మాజీ మంత్రి కేటీఆర్‌పై దాడి దాడి చేడం హేయమైన చర్య అని మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు, నాయకులు కాసాని చంద్రమోహన్, మందపాటి రాజమోహన్‌రెడ్డి, మోటూరి అన్నారు. కేటీఆర్‌పై దాడిని వారు తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో మూసీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న కేటీఆర్‌పై దాడి చేయడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. ఇందిరమ్మ రాజ్యం ముసుగులో చేస్తున్న రౌడీ పాలనను సహించేది లేదని, బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పటికీ ప్రజల తరపున పోరాటాలు చేయడంతో ముందుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జె.వెంకన్నబాబు, సత్యవరపు సంపూర్ణ, నారం రాజశేఖర్, తాడేపల్లి రవి, చిన్నంశెట్టి వెంకట నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: డీఈవో




మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర శర్మ

చింతకాని, అక్టోబర్ 1: నిష్ణాతులైన ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. కోదుమూరు ఉన్నత పాఠశాలలో ఐడీబీఐ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో వితరణగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఐడీబీఐ రీజినల్ మేనేజర్ దినవల్లి వెంకటేశ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల కోసం ప్రణాళికతో చదివి.. పాఠశాలకు, తల్లిదండ్రులకు, మండలానికి మంచిపేరు తేవాలన్నారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించి ఫలితాల్లో జిల్లాను అగ్రభాగాన నిలపాలని సూచించారు. రానున్న రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఐడీబీఐ బ్యాంక్ అధికారులు డి.వెంకటేశ్, అంగిడి రవికాంత్‌శెట్టి, గంగాధర్, ఎంఈవో శ్రీనివాసరావు, పాఠశాల చైర్మన్ సుగంధరాణి, సీఆర్పీలు బత్తుల తిరపయ్య, నిర్మల పాల్గొన్నారు.

## 'ప్రాంగణం'లో సందడి

**విద్యార్థులు, ప్రయాణికులతో కొత్తగూడెం బస్టాండ్ కిటకిట**



బస్సు ఎక్కుతున్న విద్యార్థులు



బ్యాగులతో బస్టాండ్‌కు చేరుకుంటున్న విద్యార్థులు




ప్రయాణికులతో రద్దీగా ఉన్న కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 1 : విద్యార్థులు, ప్రయాణికులతో కొత్తగూడెం బస్టాండ్ కిటకిటలాడింది. విద్యాసంస్థలకు ప్రభుత్వం బుధవారం నుంచి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే హాస్టళ్లు, వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న తమ పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. పిల్లలతోపాటు సామగ్రిని తీసుకొని బస్టాండ్‌కు చేరుకోవడంతో ప్రాంగణమంతా సందడిగా మారింది. దీనికితోడు ఉచిత బస్సు ప్రయాణం కావడంతో పిల్లలను తీసుకెళ్తున్న తల్లులు దాదాపు బస్సులోనే తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆసక్తి చూపారు. అయితే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఒకింత అసహనానికి గురయ్యారు. ప్లాట్‌ఫాంపైకి వచ్చిన బస్సులను ఎక్కేందుకు పోటీపడ్డారు.

# తల్లీరావే బతుకమ్మా..

## తెలంగాణ పూలసింగిడి



- బతుకమ్మ వచ్చె.. పూల పండుగ తెచ్చె..
- పల్లెల్లో గౌరమ్మ సంబురాలు షురూ..
- నేడు ఎంగిలి పూల బతుకమ్మ మొదలు
- 10న సద్దుల బతుకమ్మతో సమాప్తం
- 9 రోజులపాటు జగన్మాత ఉత్సవాలు



ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 1: ప్రపంచంలోనే అరుదైన పూలపండుగ బుధవారం నుంచి ఇంటింటా సందడి చేయనుంది. 'ఇంతి'ంతై విశ్వవ్యాప్తమై సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్న బతుకమ్మ ఆగమనంతో ఇంటిల్లిపాదికీ సంబురమే. ప్రకృతి వరప్రసాదమైన ఈ పూల పండుగలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో మమేకమవుతారు. తొమ్మిది రోజులు జగన్మాత స్వరూపులైన మహాగౌరి, మహాలక్ష్మి, మహాసరస్వతి సహా వివిధ అవతారాలను విభిన్న రీతుల్లో పూజిస్తారు. శతాబ్దాల తరబడి జరుపుకుంటున్న ఈ పండుగ తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక కొత్త సొబగును సంతరించుకుంది. రాష్ట్రం సిద్ధించిన నాటి నుంచి బతుకమ్మ అధికారిక పండుగగా కొనసాగుతోంది. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా జరుపుకుంటారు.

### బతుకమ్మ విశిష్టత..

హైందవ సంప్రదాయంలో కల్యాణం, గృహప్రవేశం, వినాయకచవితి, దీపావళి, వ్రతాలు నిర్వహించేటప్పుడు పసుపుతో గౌరీమాతను తయారు చేసి పూజిస్తారు. బతుకమ్మను పేర్చేటప్పుడు కూడా గౌరీమాతను తయారు చేసి పెడతారు. బతికించి, కోరికలు తీర్చే గౌరీమాతను బతుకమ్మగా మహిళలు పూజిస్తారు. పెళ్లి వయసు గల యువతులు మంచి భర్త రావాలని, వివాహమైన స్త్రీలు తన భర్త వందేళ్లు ఆయురారోగ్యాలతో బాగుండాలని, తన పసుపు కుంకుమలు కాపాడాలని బతుకమ్మను పూజించడం ఈ పండుగ విశిష్టత.

### ఆటాపాట, అలంకరణే అందం..

బతుకమ్మ పండుగలో ఆటపాటలు ప్రత్యేకం. అలంకరణల్లో విశిష్టత కనిపిస్తుంది. బతుకమ్మను పేర్చేటప్పుడు రెండు, ఐదు, ఏడు రకాల పూలు వినియోగిస్తారు. ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్తారు. చెరువులో నిమజ్జనం చేసి వివిధ రకాలైన పిండివంటలను ఆరగిస్తారు. చెరువు మట్టిని తెచ్చి ముత్తయిదువులు వాయినాలు ఇచ్చుకుంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం పితృ అమావాస్యతో మొదలయ్యే ఈ వేడుకలు ఈ నెల10 వరకు జరుగనున్నాయి.

### నేడు ఎంగిలిపూల బతుకమ్మ..

బుధవారం నాడు ఎంగిలిపూల బతుకమ్మతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రెండో రోజు అటుకుల బతుకమ్మలో సప్పిడి పప్పు, బెల్లం, అటుకుల ప్రసాదం వినియోగిస్తారు. మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మలో ముద్దపప్పు, బెల్లం, పాలతో ప్రసాదం వినియో గిస్తారు. నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మలో పాలు, బెల్లం, నానేసిన బియ్యంతో ప్రసాదం వినియోగిస్తారు. ఐదో రోజున అట్ల బతుకమ్మను బియ్యం నానబెట్టి దంచిన పిండితో తయారు చేసిన అట్ల (దోశలు) ప్రసాదం వినియోగిస్తారు. ఆరో రోజున అలిగిన బతుకమ్మలో బతుకమ్మ అలిగినట్లుగా భావించి ఆ రోజు బతుకమ్మలు పేర్చరు. ఆడరు. ఏడో రోజున వేపకాయల బతుకమ్మలో సకినాలు చేసే పిండితో వేప కాయలంత పరిమాణంలో ముద్దలుగా చేసి నూనెలో వేయించిన వంటకం ప్రసాదంగా వినియోగిస్తారు. ఎనిమిదో రోజున వెన్నముద్దల బతుకమ్మలో నువ్వులు, వెన్న, బెల్లం, నెయ్యితో తయారుచేసిన ఫలహారం వినియోగిస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మలో ఐదు రకాల సద్దుల అయిన ఫలహారం, పెరుగన్నం, చింతపండు పులిహోర, సద్ది, కొబ్బరి తురుము, నువ్వుల పొడి కలిపిన సద్ది ఫలహారం వినియోగిస్తారు. ఇలా తొమ్మిది రోజులపాటు బతుకమ్మ ఆడిపాడిన మహిళలు సద్దుల బతుకమ్మ రోజున అంగరంగ వైభవంగా బతుకమ్మల సామూహిక నిమజ్జనోత్సవాన్ని జరుపుతారు. బతుకమ్మకను సాదరంగా సాగనంపుతారు.



ఖమ్మం స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

### పల్లెపల్లెనా పూలసింగిడి..

మంగళవారం నుంచి పల్లెపల్లెనా పూలసింగిడి పులకించనుంది. పూలను కొలిచే పుణ్యమైన బతుకు పండుగలో పాల్గొనేందుకు ఇప్పటికే ఆడబిడ్డలు తమ తల్లిగారిళ్లకు చేరుకున్నారు. దీంతో పల్లెలు, పట్టణాలు సందడిగా కన్పిస్తున్నాయి. పట్టణాలు బతుకమ్మ బుట్టలు, వివిధ రకాల పూల విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవలి వర్షాలకు జలాశయాలకు నీళ్లు చేరడంతో బతుకమ్మ ఘాట్‌లు కూడా సిద్ధమయ్యాయి. గ్రామాల్లోని వాగులు, వంకలు, చెరువులు, కుంటలు జలకళతో ఉన్నాయి. పూలపండుగ కోసం తీరొక్క పూలను సేకరించే పనిలో యువతులు, బాలికల సోదరులు నిమగ్నమయ్యారు.

### బతుకమ్మ ఆవిర్భావంపై కథనాలు

బతుకమ్మ పుట్టపై గ్రామీణులు పాడుకునే పాటల్లో పలు అంశాలతోపాటు చారిత్రక నేపథ్యం గల కథలూ ఉన్నాయి. క్రీస్తుశకం 300 ఏళ్ల కాలంలో దక్షిణ భారతదేశాన్ని చాళుక్యులు పరిపాలించేవారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన వీరి వంశస్తుడైన ధర్మాంగధుడు అనే రాజుకు సంతానం లేదు. చాలా ఏళ్ల తరువాత జన్మించిన ఏకైక కుమార్తెకు లక్ష్మి అని పేరు పెట్టాడు. ఆమె అనేక వ్యాధులతో బాధపడుతూ గండాలను ఎదుర్కొంటుంది. దానికి నివారణగా శక్తిస్వరూపిణి అయిన గౌరీదేవిని ప్రకృతిలో సహజంగా లభించే పూలతో పూజించాలని ఆస్థాన పండితులు చెబుతారు.

### బతుకునిచ్చే బతుకమ్మ..

భూస్వాముల ఆకృత్యాలను భరించలేక ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంటే.. ఆమెను ఆ ఊరి ప్రజలు చిరకాలం 'బతుకమ్మా' అంటూ దీవించారట. చోళ వంశానికి చెందిన ధర్మాంగధుడు, సత్యవతి అనే రాజ దంపతులకు చాలా కాలం పాటు సంతానం కలగలేదు. వారు చేసిన నోములతో వందమంది కొడుకులు పుట్టినా, వారంతా యుద్ధంలో చనిపోతారు. దీంతో విషాదాన్ని తట్టుకోలేక రాజు దంపతులు అడవికి వెళ్లి తపస్సు చేస్తారు. అప్పుడు ప్రత్యక్షమైన లక్ష్మీదేవి.. వారి బిడ్డగా పుడతానని వరమిస్తుంది. ఈ మేరకు పుట్టిన బిడ్డ కలకాలం బతకాలని రుషులు 'బతుకమ్మ' అని నామకరణం చేస్తారు. అప్పటి నుంచి చోళ రాజ్యంలో 'బతుకమ్మ' సంక్షేమం కోసం పండుగ చేసుకోవడం ఆనవాయితీగా మారిందని, 'బతుకమ్మ' అనే దీవెనే బతుకమ్మగా వెలుగొందిందని పురాణోక్తి.

### ఏడు తరాల తర్వాతి ఆడబిడ్డ..

పూర్వం ఒక ఊరిలో ఓ పేద కుటుంబంలో ఏడుతరాల తరువాత లక్ష్మీదేవి కటాక్షంతో ఆడబిడ్డ పుడుతుంది. దీంతో ఆ కుటుంబం కాలక్రమేణా ఐశ్వర్యమంతమవుతుంది. వివాహ వయసు వచ్చిన ఆడబిడ్డకు పెళ్లి చేసి మెట్టినింటికి పంపుతారు. ఆమె పుట్టినింటి గడప దాటి వెళ్లిపోగానే ఆమె కుటుంబం ప్రకృతి వైపరీత్యాలకు ఉన్నదంతా పోయి మళ్లీ పేద కుటుంబమవుతుంది. పేదలుగా మారిన తల్లిదండ్రులు, అన్నదమ్ములను ఆదుకోవడానికి ఆ ఆడబిడ్డ మళ్లీ బతుకమ్మ పేరుతో ఏటా పుట్టినింటికి వచ్చి గౌరీమాత పూజ చేస్తుంది. దీంతో మళ్లీ ఆ ఇంట్లో లక్ష్మీ కటాక్షంతో ఐశ్వర్యం సిద్ధిస్తుంది. అందుకే ఇప్పటికీ వివాహమైన మహిళలు పుట్టింటికి వచ్చి బతుకమ్మ ఆడడం ఆనవాయితీగా వస్తోంది. ఆడబిడ్డను మహాలక్ష్మిగా, గౌరీమాతగా కుటుంబం భావించడం తెలంగాణ సంస్కృతిలో భాగమైపోయింది.

